ప్రజాశక్తి

బుధవారం 2 ఆగస్టు 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతర్జాతీయ స్థాయికి విశాఖ

◆ ఇనార్బిట్ షాపింగ్ మాల్ ఓ ఆణిముత్యం ◆ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి.. ఒక్క ఫోన్ కాల్‌తో అందుబాటులో ఉంటాం

◆ పారిశ్రామికవేత్తలకు యుద్ధప్రాతిపదికన సాయం అందిస్తాం ◆ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ◆ నగరంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీబిజీ

ఇనార్బిట్ మాల్ శిలాఫలకం వద్ద సిఎం జగన్మోహన్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో మీకు మేం అందుబాటులో ఉంటాం... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి. పారిశ్రామికవేత్తలకు ఏ విధమైన సహాయ, సహకారాలు ఇస్తున్నామో కచ్చితంగా మీరు చూస్తారు. విశాఖను అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా రహేజా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఇనార్బిట్ మాల్ విశాఖకు ఆణిముత్యమని వ్యాఖ్యానిస్తూ మిగిలిన రాష్ట్రాల కంటే ఎక్కువ మేలు తమ ప్రభుత్వం వల్ల పారిశ్రామికవేత్తలకు లభిస్తుందంటూ రహేజా సంస్థకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అనంతపురం జిల్లా హిందూపురంలో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ టెక్స్‌టైల్స్ పార్క్ వల్ల 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఇనార్బిట్ మాల్ 13 ఎకరాల్లో పూర్తయ్యాక రెండోదశలో అక్కడ నిర్మించబోయే ఐటి స్పేస్ సెంటర్‌తో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయన్నారు.

నిరాశ మిగిల్చిన పర్యటన

సిఎంకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఎయిర్ పోర్టు నుంచి కైలాసపురంలోని ఇనార్బిట్ మిగతా 2లో..

షాపింగ్ మాల్ ఆణిముత్యమైతే.. స్టీల్‌ప్లాంట్ ఏమిటి ?

విశాఖ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రహేజా సంస్థ కైలాసపురంలో 17 ఎకరాల్లో నిర్మించబోయే ఇనార్బిట్ షాపింగ్ మాల్ 'విశాఖకు ఆణిముత్యం' అంటూ వ్యాఖ్యానించడంపై అక్కడున్న జిల్లా స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విశాఖపట్నంకు బ్రాండ్ ఇమేజ్‌ను తెచ్చిన 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్'ను కేంద్ర ప్రభుత్వం 100 శాతం అమ్మకానికి పెడితే.. ఆ విషయాన్ని పట్టించుకోకుండా నిర్మాణమేకాని ఓ షాపింగ్ మాల్‌కు స్వయంగా ముఖ్యమంత్రి కితాబు ఇవ్వడం పట్ల అభ్యంతరంగా ఒకరి ముఖాలు మరొకరు చూసుకోవడం, ఇదో 'వింత' అంటూ కొద్ది మంది వ్యాఖ్యానించుకోవడం కనిపించింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట మాత్రమైనా ప్రస్తావించలేదు. లక్షల మంది ఉపాధి పొందుతూ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి రూ.వేల కోట్ల సాయం అందించే వైజాగ్ బ్రాండ్ స్టీల్ ప్లాంట్‌పైనగానీ, గంగవరం పోర్టు సృష్టిస్తున్న 'కోల్' ఆటంకాలపైనగానీ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందన్న అంశం జోలికి జగన్ పోలేదు.

స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తెచ్చేందుకు ప్రతిజ్ఞ

▶ వార్త 4లో..

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించాలి

▶ వార్త 5లో..

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు

కనీస వేతనాలు ఇవ్వాలి

మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. సంఘం విశాఖ జిల్లా నాలుగో మహాసభ మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఉన్నారని, విశాఖలో 900 మంది ఉన్నారని, వీరి సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్ర మిగతా 2లో..

నేటి నుంచి ఇంటికే సరుకులు

◆ గర్భిణులు, బాలింతలకు ముఖ గుర్తింపు తప్పనిసరి

◆ సిగ్నల్ లేకపోతే వస్తువుల అందజేత అనుమానమే..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు, బాలింతలకు బుధవారం నుంచి సంచుల్లో పోషకాహార సరుకులు అందజేయనున్నారు. కేంద్రాల్లో భోజనాలు వండిపెట్టకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బొమ్మలతో వున్న సంచుల్లో సరుకులు పెట్టి లబ్ధిదారుల ఇంటికి ఇచ్చే కార్యక్రమం నేటి నుంచి ప్రారంభంకానుంది. అయితే లబ్ధిదారుల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశాక వారికి సరుకులు ఇవ్వాల్సివుండడంతో అటు లబ్ధిదారులకు, ఇటు అంగన్‌వాడీలకు కొత్త సమస్యలు ఏర్పడనున్నాయి. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ (టిహెచ్ఆర్) కింద ఇచ్చే సరుకులకు ముందుగా లబ్ధిదారుల ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సివుంది. సిగ్నల్ లేకపోతే వారికి సరుకులు ఇచ్చే అవకాశం లేదు. సిగ్నల్స్ లేక లబ్ధిదారుల ఫొటోలు తీసి, మిగతా 2లో..

నేటి నుంచి ఇంటికే సరుకులు

(మొదటి పేజీ తరువాయి..) నమోదుచేయలేని వాస్తవ పరిస్థితులు క్షేత్రస్థాయిలో వున్నాయి. సిగ్నల్ సమస్య ఏర్పడి, లబ్ధిదారుల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయలేకపోతే సరుకులు ఇచ్చే ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వం సూచించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని బాలింతల ఇంటికి వెళ్లి అంగన్‌వాడీలు సరుకులు ఇవ్వాల్సివుంది. ఇంటి దగ్గర సిగ్నల్ లేకపోతే బాలింతను సిగ్నల్ ప్రాంతానికి తీసుకొనివెళ్లి ఫొటో తీసి సరుకులు ఇవ్వాలి. సరుకులు ఇవ్వడానికి ముందు లబ్ధిదారుని ఫొటో అప్‌లోడ్ తప్పనిసరిచేయడంతో గతంలోవలె లబ్ధిదారుని కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు సరుకులు తీసుకొనివెళ్లే అవకాశం ఇప్పుడు ఏ మాత్రమూ లేదు. అంగన్‌వాడీలకు ఐడియా, ఎయిర్‌టెల్ సిమ్‌లను ప్రభుత్వం ఇచ్చింది. వీటి నెట్‌వర్క్ ప్రస్తుతం బలహీనంగావుంది. దీంతో ఇప్పటికే లబ్ధిదారుల ఫొటోలన్నీ అప్‌లోడ్ చేయలేక అంగన్‌వాడీలు తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడకముందే సరుకుల అందజేత కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.

ఇవీ ఇచ్చే సరుకులు

గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా తొలివిడతలో మూడు కిలోల బియ్యం, కేజీ కంది పప్పు, అర లీటర్ నూనె, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, రెండు కేజీల చోడిపిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చెక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం అందజేస్తారు. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు తొలి విడతలో 13 గుడ్లు, లీటరున్నర పాలు ఇవ్వనున్నారు. రెండో విడతలో 12 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు వండి పెట్టనున్నారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ ప్లస్ కింద నాన్ షెడ్యూల్ ట్రైబల్ మండలాలైన చీడికాడ, మాడుగుల, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరంల్లోని 77 అంగన్‌వాడీ కేంద్రాలకు మైదాన ప్రాంతాల కంటే అదనంగా 250 గ్రాముల బెల్లం, వేరుశనగ చెక్కీలు, ఎండు ఖర్జూరం ఇవ్వనున్నారు.

లబ్ధిదారులు వీరు

జిల్లాలోని తొమ్మిది ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 1908 అంగన్‌వాడీ కేంద్రాల్లో 87,275 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 46,113 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 22,814 మంది, గర్భిణులు 9,597 మంది, బాలింతలు 8,751 మంది లబ్ధిపొందుతున్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు మినహా మిగిలిన లబ్ధిదారులకు సరుకులు ప్రతినెలా ఇవ్వనున్నారు. నేటి నుంచి గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు రేషన్ సరుకులు సంచుల్లో పెట్టి అందజేసేందుకు ఏర్పాట్లన్నీ పూర్తిచేసినట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి అనంతలక్ష్మి 'ప్రజాశక్తి'కి తెలిపారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి..) ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. వీరికి 12 నెలలకు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచి ఇవ్వాలని కోరారు. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని, గ్యాస్, వంటపాత్రలను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పవద్దని కోరారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫారం సరఫరా చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాగి జావ తయారు చేయడానికి అవసరమ్యే వంటపాత్రలు, గ్యాస్ స్టవ్‌లను ప్రభుత్వమే సమకూర్చాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్స్‌ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 8న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నాకు మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక మహిళ కన్వీనర్ పి.మణి తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభకు రాము, భవాని, రాంబాయి, మంగశ్రీ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని తీర్మానాలు చేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీని 31 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా ఎన్.సీతాభవాని, ప్రధాన కార్యదర్శిగా జి.మంగశ్రీ, కోశాధికారిగా కె.కళాచందనలతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా డి.వరలక్ష్మి, ఎస్‌పి.కాళి, ఎస్.నిర్మల, పార్వతి, రత్నం, రాము, ఈశ్వరమ్మ, కొండమ్మ, రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తూర్పు నావికాదళ అధిపతిగా రాజేష్ పెంధార్కర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్టర్న్ నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్‌గా రాజేష్ పెంధార్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నావల్ బేస్‌లో జరిగిన పెరేడ్‌లో ఆయన సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి నావికాదళంలోని అన్ని విభాగాల అధికారులూ హాజరయ్యారు. రాజేష్ పెంధార్కర్ 1987లో భారత నౌకాదళంలోకి ప్రవేశించారు. ఆయన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. డిఫెన్స్, స్ట్రాటజిక్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉన్నారు. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ స్పెషలిస్ట్‌గా ఆయనకు పేరుంది.

సిజిహెచ్‌ఎస్‌ను కుల్చడం అన్యాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెదవాల్తేరులో ఉన్న సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సెంటర్ (సిజిహెచ్‌ఎస్)ను కూల్చడం అన్యాయమని, ఫలితంగా లక్షా 25 వేల మంది కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు రోడ్డున పడ్డారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. సిజిహెచ్‌ఎస్‌ను జివిఎంసి అధికారులు కూల్చివేయడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి మంగళవారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నడుమ సమన్వయ లోపం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని అన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అంతర్జాతీయ స్థాయికి విశాఖ

మాల్ వరకూ దారి పొడవునా వైసిపి కార్యకర్తలు, కొంతమంది సాధారణ జనం, మహిళలు పెద్ద సంఖ్యలో ఉదయం 9 గంటలకే విచ్చేశారు. ఆయన విశాఖ ఎయిర్ పోర్టుకు 11 గంటలకు వచ్చాక రోడ్డు మార్గంలో వారికి కారులోంచే అభివాదం చేసుకుంటూ ఇనార్బిట్ మాల్‌కు విచ్చేశారు. లోపల శంకుస్థాపన, సిఎం ప్రసంగం సాగుతుండగా బయట వేచివున్న వేల సంఖ్యలో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతారో వినాలని విచ్చేసిన తమకు నిరాశ ఎదురైందంటూ ఈ సందర్భంగా వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అదే విధంగా ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థులతో సిఎం వైఎస్ జగన్ ఇంటరాక్షన్ అవ్వనున్నారని ఈ నెల 31 సోమవారం వరకూ అధికారులు ప్రకటించారు. తీరా చూస్తే చివరి నిమిషంలో ఈ ఇంటరాక్షన్‌ను రద్దు చేశారు. దీంతో విద్యార్థుల్లోనూ అసంతృప్తి రేగింది.

సిఎంకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్న వైసిపి కార్యకర్తలు, మహిళలు

ఎయులో రూ.130 కోట్ల విలువైన 5 ప్రాజెక్టులు ప్రారంభం

ఎంవిపి.కాలనీ : సిఎం జగన్ తన విశాఖ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఆంధ్ర విశ్వ విద్యాలయానికి చెందిన ఐదు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. తొలుత ఎయు ప్రిన్సిపల్స్, ఇతర అధికారులను ముఖ్యమంత్రికి వీసీ ప్రసాద్‌రెడ్డి స్వయంగా పరిచయం చేశారు. ఎలిమెంట్ భవనం బయట పెద్ద సంఖ్యలో విద్యార్థులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సిరిపురం వద్దనున్న ఫార్మా ఇంక్యుబేషన్, బయో మానిటరింగ్ హబ్-ఎలిమెంట్‌కి చేరుకున్నారు. అక్కడ మొదటగా ఎలిమెంట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అదే వేదిక నుంచి మరో నాలుగు భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించారు. మూడు సంవత్సరాలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 18 ప్రాజెక్టులు చేపట్టగా వీటిలో ఐదు ప్రాజెక్టులను సిఎం ఆరంభించారు. వీటిలో టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, ఫార్మా ఇంక్యుబేషన్ ఎలిమెంట్, ఎయు డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ అల్గారిథమ్, ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎయు అవంతి ఆక్వా కల్చర్ ఇన్నోవేషన్ స్కిల్ హబ్ ఉన్నాయి. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయుక్తంగా నిలిచే ఈ ఐదు కేంద్రాల ప్రత్యేకతలను, పనితీరును, ప్రగతిని వీసీ ప్రసాద్‌రెడ్డి సిఎంకు వివరించారు. అనంతరం ఎలిమెంట్ భవనంలో ఏర్పాటుచేసిన ఫార్మసీ లేబొరేటరీని ముఖ్యమంత్రి పరిశీలించి అక్కడ ఉన్న ఉపకరణాల పనితీరు తెలుసుకున్నారు. ఎయులో 130 కోట్ల రూపాయల వ్యయంతో విద్యార్థులకు ఉపయుక్తంగా అభివృద్ధి చేసిన భవనాలను, ప్రాజెక్టులను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం ప్రసంగంలో పదనిసలు

ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ చేసిన అనంతరం జగన్ మాట్లాడుతూ రహేజాకు కేటాయించిన 17 ఎకరాల్లో 13 ఎకరాల్లో మాల్ వస్తుందని, మిగతా ప్రదేశమైన రెండున్నర లక్షల చదరపు అడుగుల స్థలంలో ఐటి సంస్థ, అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ రెండో దశలో రానున్నాయని అనడానికి బదులు రెండున్నర లక్షల ఎకరాల్లో అంటూ సిఎం అనడంతో అక్కడగల ప్రజలు, అధికారులు నివ్వెరపోయారు.

సభా వేదికపై కెకె.రాజు.. కిందన ఎమ్మెల్యేలు

కైలాసపురం వద్ద జరిగిన సిఎం సభలో వేదికపై వైసిపి ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త కెకె.రాజు ఆశీనులై ఎమ్మెల్యేలంతా వేదిక దిగువన కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది.. విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ కూడా కెకె.రాజు తర్వాత కూర్చోవడం అందరినీ నివ్వెరపరచినట్టయింది. వైసిపికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులంతా దిగువకే పరిమితం అయ్యారు. కెకె.రాజుకు ఎందుకంత ప్రాధాన్యం అంటూ వారిలోవారే గుస్సా అయ్యారు.

ఉద్యమ నేతల గృహ నిర్బంధం

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిపిఎం జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్. పి.మణి, ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు బి.గౌతమ్‌లను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ చర్యను సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. పోలీసుల నిర్బంధంపై ఆ పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు స్పందిస్తూ ముఖ్యమంత్రి వస్తే సిపిఎం నాయకుల గృహనిర్బంధం దేనికని ప్రశ్నించారు. జిల్లాలోని ముఖ్య సమస్యలను గాలికొదిలేసి సిఎం పర్యటన సాగడం దారుణమన్నారు. విశాఖ పోర్టు భూముల్లో రహేజా సంస్థ చేపట్టిన మాల్ ప్రారంభోత్సవానికి సిఎం రావడం సిగ్గుచేటని అన్నారు. నిర్బంధ చర్యలు ఆపకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మణి, కుమార్‌లను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

ఎన్‌జిఒ కౌన్సిల్ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఏపి ఎన్‌జిఒ సంఘం కౌన్సిల్ సమావేశాలు సెప్టెంబర్ 21, 22 తేదీలలో నిర్వహించనున్నట్లు ఏపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ సంఘం భవనంలో సంఘం సమావేశం నిర్వహించి కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జాబ్ కేలండర్ కోసం ఆందోళన

కలెక్టరేట్ : ఖాళీగా ఉన్న 2 లక్షల 30 వేల ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ కేలెండర్‌ను ప్రకటించాలని కోరుతూ మంగళవారం ఆర్‌కె బీచ్ పరిసరాల్లో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు.ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1046/2021

Between:
STATE BANK OF INDIA, SME Centre, Visakhapatnam,
Rep. by its Manager ...Plaintiff
And:
M/s. Kshemkari Steels,
Rep. by its Proprietor Khangar Singh ...Defendant

SUMMONS

To,
The Defendant :
M/s. Kshemkari Steels,
Rep. by its Proprietor: Khangar Singh,
S/o. Ran Singh,
Hindu, aged 28 years,
D.No.45-40-37, Main Road,
Abidnagar, Akkayyapalem,
Visakhapatnam-530016.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of loan amount with subsequent interest and costs and other reliefs. You are hereby summoned to appear in the above Court in person or through a Pleader duly instructed, and the matter stands posted to **23-08-2023** at **10:30 A.M** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

(By Order of the Hon'ble Court)
Smt. L.V. RAMANI,
Advocate,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE VIth ADDL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P.NO. 172 / 2022 O.S. 1213 / 2009

Between:
Sagi Vikram Reptd GPA Holder
Umaraju Sagi ... D.Hr
And:
K.Srinivasa Rao ... JDR
JDR
Kunapureddy Srinivasa Rao
S/o. Late Ankala Rao,
D.No. 49-54-6/7, B.S.Layout
Seethammadhara, Visakhapatnam.

పై నెంబరు అమలును మీ నుండి రూ. 14,03,414/-లు వసూలు నిమిత్తం దాఖలు చెయ్యగా సదరు కేసు నందు రూలు 22 నోటీసు మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా పంపించిననూ మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే:22-8-2023దీకి** వాయిదా అయివున్నది. కావున **తే:22-8-2023దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు కేసు మీ పరోక్ష మందు తీర్మానించబడును.

(By Court Order)
L.SATYANARAYANA
Advocate,
Ramachandra Residence
D.No. 10-4-20, Ramnagar,
Visakhapatnam.
Visakhapatnam. Cell:9440584322
DT. 01-8-2023

IN THE HON'BLE COURT OF THE IInd ADDL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S. 889 / 2022

Between:
S.Ravindra ... Plaintiff
And:
R.Simhachalam ... Defendant
NOTICE
DEFENDANT
Reedy Simhachalam
S/o. Krishna Rao,
D.No. 6-12-70/2, Dobi Street,
Chinawaltair, Visakhapatnam.

పై నెంబరు దావాను, దావా ఆస్తి నుండి మిమ్ములను ఖాళీ చెయ్యమని కోరుచూ సదరు దావాను దాఖలు చెయ్యగా సదరు కేసునందు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే:4-10-23దీకి** వాయిదా అయివున్నది. కావున **తే:4-10-2023దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు కేసు మీ పరోక్షమందు తీర్మానించబడును.

(By Court Order)
G.T.V.MALLESWARA RAO
Advocate, # 20-1-91/B,
2nd Floor, Durgalamma Temple,
Poorna Market Road,
Visakhapatnam-530001
Visakhapatnam. Cell : 9440110819
DT. 01-8-2023

ఎల్లో డే వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా ఎల్లో డే

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ భారతీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎల్లో డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతీ ఇంగ్లీష్ మీడియం స్కూలు ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని స్కూలు అధినేత ఎం.వి.రావు దంపతులు ప్రారంభించారు. ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి వివిధ వేషధారణలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల ఆటపాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎం.వి.రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న అఖిల ప్రియను, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు.

పోతిన వరం వర్ధంతి

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ ప్రాంత సీనియర్ రాజకీయ నాయకులు పోతిన వరం 3వ వర్ధంతిని చంద్రంపాలెం వైసిపి నాయకుల ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రంపాలెం బాపూజీ కళా మందిరంలో వరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, పోతిన వరం కుమారులు పోతిన జోగి, సోదరులు పోతిన వెంకటరమణ, పిళ్లా లక్ష్మణ, పిళ్లా సూరిబాబు, పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా పోతరాజు, పిళ్లా అప్పన్న, జగుపిల్లి నరేష్, పోతిన అచ్చియ్య పాత్రుడు, పిళ్లా రామారావు, జగుపిల్లి సాయి, జగుపిల్లి నాని పాల్గొన్నారు.

గీతంలో తల్లి పాల వారోత్సవాలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆస్పత్రి ప్రాంగణంలో తల్లి పాల వారోత్సవాలను స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన తరువాత తల్లి నుంచి మూడు రోజుల పాటు అందే తల్లి పాలు చిక్కగా పోషక పదార్థాలతో ఉంటాయని, వీటిని అందించటం తప్పనిసరి అని పేర్కొన్నారు. తల్లి పాల వల్ల రోగ నిరోధక శక్తి పెరగటంతో పాటు జీర్ణాశయ సంబంధ సమస్యలు తక్కువగా ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం ఎన్ఎస్-ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మెడికల్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, జ్యోతిరాణి, డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ, తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జీవనరాణి, డాక్టర్ ఎన్.రమారెడ్డి, డాక్టర్ సమత, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి -ఆనందపురం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా 2022-23 సంవత్సరంలో జరిగిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, సోషల్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి 1335 పనులకు గాను వేతన రూపంలో రూ.13.18 కోట్లు, సామాగ్రి రూపంలో రూ..1.86 కోట్లు మొత్తం రూ.15.04 కోట్ల ఖర్చు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని మస్టర్లలో దిద్దుబాట్లు ఉన్నట్లు గుర్తించారు. బి.కల్లాలు, గండిగుండం గ్రామ పంచాయతీలలో పని ప్రదేశంలో సమాచార బోర్డు నిర్మించాలని సూచించారు. హౌసింగ్‌కు సంబంధించి 90 రోజులకు ఎమ్.బుక్స్ రికార్డు చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ప్రాజెక్ట్ డైరెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఇ.సందీప్, అదనపు పీడీ ఆంజనేయులు, అసిస్టెంట్ పీడీ రోజా రాణి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, అంబుడ్స్‌మెన్ దొరబాబు, మండల హౌసింగ్, పంచాయతీరాజ్ ఎఇలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

[redacted]

'ఉపాధి' సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

కల్లుగీత కార్మికుల సమస్యలపై సిఎమ్‌కు వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో కల్లుగీత వృత్తిదారులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత విన్నవించారు. ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు విశాఖ వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని పిల్లి సుజాత కలిసి యాత కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. యాతజాతీయులు పేదరికం, నిరక్షరాస్యత, సాంఘిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. పాఠశాలల ప్రవేశ సమయంలో యాతలకు బదులుగా శెట్టిబలిజలుగా నమోదు చేసుకున్నారని, దీనివల్ల అందువల్ల బిసి 'ఎ' కు బదులుగా బిసి'బి'గా నమోదైందని, ఈ అంశాన్ని సరి చేయాలని కోరారు. యాతలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు పరిశీలించాలని కోరారు. యాత సామాజిక వర్గం వారికి నామినేటెడ్ విధానంలో ఎమ్మెల్సీగానైనా, ఎంపీగానైనా అవకాశం కల్పించాలని విన్నవించారు. ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం భవన నిర్మాణానికి ఆరిలోవ 13వ వార్డు పరిధిలోని రెండు, మూడు సర్వే నెంబర్లో 1800 చదరపు గజాల ప్రభుత్వ బంజరు భూమిని కేటాయించాలని, దీంతోపాటు ప్రతి నియోజకవర్గంలోని యాత సంఘానికి 500 చదరపు గజాల స్థలం కేటాయించాలని కోరారు. విశాఖపట్నం నగరంలోకి కల్లు తెచ్చుకొని విక్రయించేందుకు అనుమతులు జారీ చేయాలని, వృత్తిపనులు చేస్తూ మృతిచెందిన 23 మంది, అంగవైకల్యం పొందిన 32 మందికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ప్రతి జిల్లాలో రెండు, మూడు కల్లు సొసైటీలకు 5 ఎకరాల బంజరు భూమి కేటాయించాలని, నిరుద్యోగులకు సబ్సిడీపై రుణాలు అందించాలని విన్నవించారు.

రాష్ట్రానికి బిజెపి నయవంచన : మూల వెంకటరావు

ప్రజాశక్తి-మాధవధార : రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన విభజన హామీల అమలుల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నయవంచన మరో మారు స్పష్టమైందని ఎపి కాంగ్రెస్ ఒబిసి విభాగ చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాష్ట్ర ప్రయోజనాలకు చెల్లు చీటీ రాసినట్లు చెప్పారని తెలిపారు. బిజెపి నేతలు ఆడుతున్నట్లు ఆడుతూ వారెక్కిన పల్లకిని మోస్తున్న రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల ముగ్గురు నేతలకు రాష్ట్ర ప్రయోజనాల పట్ల చీమకుట్టినట్టు కూడా ఉండడంలేదని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ ఇవ్వకపోవడం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు కేటాయించకపోవడం, ప్రస్తుతం కడప ఉక్కు సాధ్యం కాదని, దుగ్గిరాజుపట్నం పోర్టు కుదరదని కూడా కేంద్రం చెప్పడాన్ని చూస్తే విభజన హామీలను కేంద్రం పూర్తిగా విస్మరించినట్లేనని పేర్కొన్నారు. వీటన్నింటిపై అసంతృప్తి రగలుతుండటంతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి స్వరం మారిందని ఆరోపించారు.

రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు దోబూచులాట ధోరణి మానుకొని, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

2024 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రత్యేక హోదాలో ఉన్న అన్ని అంశాలను అమలు చేస్తామని రాహుల్ గాంధీ ఇప్పటికే చెప్పారని తెలిపారు. ఇవి అమలుకావాలంటే రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ గెలవు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు.

17 నుంచి సిపిఐ బస్సుయాత్ర

ప్రజాశక్తి గాజువాక : 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో సిపిఐ గాజువాక నియోజకవర్గం సర్వ సభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీన ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ బస్సు యాత్రను సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారని తెలిపారు. బస్సు యాత్రలో సిపిఐ రాష్ట్ర నాయకత్వం పాల్గొంటుందని చెప్పారు. ఎంఎస్.అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు జె.రామకృష్ణ, జి.ఆనంద్, పల్లేటి పోలయ్య, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె.పోతన్న, పి.దుర్గారావు, మహిళా నాయకులు కె.వనజాక్షి, పిల్లా సూర్యపద్మ పాల్గొన్నారు.

చిగుళ్ల వాధిని అశ్రద్ధ చేయొద్దు : గీతం దంత నిపుణులు

ప్రజాశక్తి-మధురవాడ : చిగురుళ్ళవ్యాధిని అసలు అశ్రద్ధ చేయొద్దని గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి వైద్య నిపుణులు సూచించారు. నోటి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆస్పత్రి పెరియోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.త్రినాథ్ కిషోర్ మాట్లాడుతూ, చిగుళ్లలో నొప్పి, రక్తస్రావం, దంతాల మధ్య ఖాళీలు ఏర్పడటం, నోటి దుర్వాసన, దంతాలలో ఆహార పదార్థాలు ఇరుక్కుని ఉండటం సాధారణ దంత సమస్యలని పేర్కొన్నారు. ఆయా సందర్భాలలో తక్షణమే దంత వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : ప్రేమ విఫలమైందని 14 సంవత్సరాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన గాజువాక సమీపంలోని కైలాసనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... కైలాసనగర్‌కు చెందిన పెంట అఖిల్ (14) గాజువాకలోని ప్రయివేట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. అఖిల్ ప్రేమను అమ్మాయి నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 'నువ్వు నాతో ఉన్నప్పుడు నాకు ఇంకెవరు వద్దనిపిస్తోంది. నువ్వు నాతో లేనప్పుడు నా కంటికి ఎవరూ లేరనిపిస్తోంది' అని లెటర్ రాశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : వేములవలస శ్రీ వెంకటేశ్వర స్కూల్ ఎదురుగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా, వీరఘట్టం మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఉమ్మిడాల చంద్రమౌళి (43) విశాఖపట్నం దుర్గానగర్‌లో నివసిస్తున్నాడు. కూలి పనులుచేస్తూ భార్యాభర్తలు జీవనం గడుపుతున్నారు. మామయ్యకు ఆరోగ్యం బాగాలేదని తెలిసి భార్య వెంకటలక్ష్మిని తీసుకొని శ్రీకాకుళం జిల్లాలోని గ్రామానికి వెళ్లాడు. భార్యను అక్కడే ఉంచి ఆయన స్కూటీపై విశాఖ వస్తుండగా వేములవలస వెంకటేశ్వర స్కూల్ సమీపంలో వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొట్టింది. చంద్రమౌళి రోడ్డుపై పడటంతో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర తీరంలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : రుషికొండ సాగరతీరంలో గుర్తు తెలియని యువకుని మృతదేహం మంగళవారం ఒట్టుకు కొట్టుకొచ్చింది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయసు సుమారు 27 నుంచి 30 ఏళ్ళ మధ్య ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారానికి తరలించారు. ఆరిలోవ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం-అనకాపల్లి మెయిన్ రోడ్డులోని బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ వద్ద రోడ్డు ప్రమాదంలో గజపతినగరం గ్రామానికి చెందిన శరగడం సాయి(22) మృతి చెందాడు. సాయి తన ద్విచక్ర వాహనంపై గజపతినగరం నుండి చోడవరం వెళుతుండగా, లెక్కల రామారావు సైకిల్‌పై అదే తోవలో వెళుతున్నాడు. ఈ సమయంలో సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని తప్పించకపోయి బండి అదుపుతప్పి పడిపోవడంతో సాయి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి తాగుతున్న 9 మంది అరెస్ట్

ప్రజాశక్తి- మధురవాడ : గంజాయి తాగుతున్న 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దేవిమెట్ట సమీపంలోని తుప్పల్లో 9 మంది గంజాయి తాగుతున్నారని సమాచారం రావడంతో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వారి నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
ఉద్యోగ అవకాశాలు
విశాఖపట్నం కేంద్రంలో మార్కెటింగ్ విభాగాల్లో పని చేయుటకు ఉద్యోగాలు ఉన్నాయి
ఆసక్తిగలవారు మా కార్యాలయానికి వచ్చి సంప్రదించగలరు.
1. గాజువాక డివిజన్ కో-ఆర్డినేటర్ (మార్కెటింగ్)
2. జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ (ప్రింటింగ్ వర్క్)
3. హెల్పర్స్ (ప్రింటింగ్ సెక్షన్)
☛ మొదటి ఉద్యోగానికి ఇతర పత్రికలలో మార్కెటింగ్‌లో అనుభవం ఉండాలి. టీంని లీడ్ చేసే సామర్థ్యం ఉండాలి
☛ 2వ ఉద్యోగానికి ప్రింటింగ్ వర్క్ ఆర్డర్లు బుక్ చేసే అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
☛ 3వ ఉద్యోగానికి 10వ తరగతి/ఐ.టి.ఐ లేదా ప్రింటింగ్ సెక్షన్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099125, 9490099133
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3, 'జ' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

దీక్షలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

'గంగవరం' పోరాటం మరింత ఉధృతం

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తాతారావు చెప్పారు. అదాని గంగవరం పోర్టు కార్మికుల చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రిని కలిసేందుకు ఐదుగురికి అపాయింట్‌మెంట్ ఇప్పిస్తానని ఎమ్మెల్యే నాగిరెడ్డి చెప్పినా దొరకలేదన్నారు. అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో సమస్యను తెలిపేందుకు కార్మికులు ఎయిర్‌పోర్టు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తే 11 మందిని పోలీసులు నిర్బంధించి, ముఖ్యమంత్రి వెళ్లిన తర్వాత విడిచి పెట్టారని తెలిపారు. సమస్యను పరిష్కరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేనట్లు కనబడుతోందని పేర్కొన్నారు. అందుకే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మాదా అప్పారావు, కదిరి సత్యానందం, కదిరి సత్తయ్య, రాజు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రభుత్వాల విధానాలతోనే హత్యలు

ప్రజాశక్తి-పెందుర్తి : మహిళలపై హత్యలు పెరగడానికి ప్రభుత్వాల విధానాలే కారణమని సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి పేర్కొన్నారు. వృద్ధురాలిని వాలంటీర్ హత్యచేయడంపై పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాలంటీర్‌గా చేస్తున్న వ్యక్తి హత్య చేస్తే మహిళలకు ఇంకా రక్షణ ఎక్కడుంటుందని ప్రశ్నించారు. వాలంటరీగా నియమించే ముందు వారి ప్రవర్తనా తీరును చూడరా అనే ప్రశ్నించారు. మహిళా చట్టాలు పటిష్టంగా అమలు చేయని కారణంగానే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు, సిఐటియు నాయకుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన చొక్కాకుల దంపతులు

ముఖ్యమంత్రిని కలిసిన చొక్కాకుల దంపతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు క్వార్టర్స్ సముదాయంలో ఇనార్బిట్ మాల్ భూమి పూజ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని వికె పిసిపిఐఆర్ యుడిఎ చొక్కాకుల లక్ష్మి, వైసిపి నాయకుడు వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిశారు. బాగున్నావా వెంకటన్న అంటూ ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించినట్లు చొక్కాకుల వెంకటరావు తెలిపారు.

అప్పన్న సేవలో మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఎఇఒ భ్రమరాంబ, పర్యవేక్షకులు సునీల్‌వర్మ ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. మంత్రి ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ఎఇఒ భ్రమరాంబ మంత్రిని సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

రాళ్లు తేలిన రహదారి

- రాకపోకలకు ఇబ్బందులు
- సింహగిరి కాలనీలో మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి - ఆరిలోవ : అసలే కొండవాలు ప్రాంతం.. దీనికి తోడు వర్షాకాలం.. రాళ్లు తేలిన రహదారితో స్థానికులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొమ్మిదేళ్లుగా ఇదే పరిస్థితి. ప్రభుత్వాలు, పాలకులు మారినా వాగ్దానాలే తప్ప రహదారిని పునరుద్ధరించే నాథుడే కనడలేదు. జివిఎంసి 12వ వార్డులో పంచ గ్రామాల్లో ఒకటైన కొండవాలు ప్రాంతమైన సింహగిరి కాలనీలో సరైన మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాడైపోయిన ఇళ్లను మరమ్మతులు చేయించుకుందామంటే దేవస్థానం సిబ్బంది అడ్డుకుంటున్నారు. కాలనీ రహదారి మొత్తం రాళ్లు తేలి ఉంది. ఆ రోడ్డులో ప్రయాణించాలంటే అవస్థలు తప్పడంలేదు. హుదూద్ తుపాను సమయంలో రిటర్నింగ్ వాల్ కట్టేటప్పుడు ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రహదారిని పునర్నిర్మించలేదు. ఇటీవల కాలంలో వాహనదారులు అదుపు తప్పి పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. సుమారు 15 మంది గాయాలపాలయ్యారు. గత సార్వత్రిక ఎన్నికల్లోనూ, కార్పొరేషన్ ఎన్నికల్లోను రాజకీయ నేతలు వాగ్ధానాలు ఇచ్చి ఓట్లు వేయించుకొని గెలుపొందారు. తరువాత వాగ్ధానాలు మరిచి పోయారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక్కడ ప్రజలు గుండెల్లో గుబులు మొదలౌతోంది. దిన దిన గండంగా గడుపుతుంటారు. ఎప్పుడు ఏ బండ ఏ ఇంటి మీద పడతుందోనని భయం గుప్పెట్లో పెట్టుకొని జీవిస్తుంటారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

సింహగిరికాలనీలో రాళ్లు తేలిన ప్రధాన రహదారి

స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తెచ్చేందుకు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రాబోయే మూడు నెలల్లో లాభాల్లోకి తెచ్చేందుకు సమిష్టిగా కృషిచేస్తామని సిఎమ్‌డి అతుల్‌భట్‌తో పాటు డైరెక్టర్లు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ప్లాంట్ ఎదుర్కొంటున్న సవాళ్లను, ఆర్థిక ఒత్తిడి గురించి ఉద్యోగులకు సిఎమ్‌డి అతుల్‌భట్ వివరించారు. రాబోయే మూడు నెలల్లో కంపెనీ పనితీరును మార్చేందుకు, లాభాల్లోకి దూసుకెళ్లేందుకు తమ శాయశక్తులా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ మరోసారి తమ నిబద్ధతను పునరుద్ఘాటించాలని కోరారు.

ప్లాంట్ సామర్థ్య వినియోగాన్ని పెంచడం, ఉక్కు ఉత్పత్తుల అవుట్‌పుట్‌ను 20 శాతం పెంచడంపై దృష్టి పెట్టాలని ఉద్యోగులను కోరారు. బొగ్గుమిశ్రమాన్ని ఆప్టిమైజ్ చేయడం, పల్వరైజ్డ్ కోల్ ఇంజెక్షన్, ఆక్సిజన్ ఎన్‌రిచ్‌మెంట్‌ను, స్క్రాప్ వినియోగాన్ని పెంచడం, స్టీల్‌మెల్టింగ్ షాప్ కన్వర్టర్‌లలో ట్యాప్-టు-ట్యాప్ సమయాన్ని తగ్గించడం, మిల్లులలో రోలింగ్ సమయం పెంచడం, ఫెర్రో అల్లోయ్స్, రిఫ్రాక్టరీస్ వినియోగం తగ్గించడం తదితర వ్యయ తగ్గింపు కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని పది శాతం తగ్గించడంపై కూడా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. అత్యంత సరసమైన ధరలకు ముడిపదార్థాలను కొనుగోలు చేయడం, మార్కెట్ వాటాను పెంచడం, ఉక్కు ఉత్పత్తుల నిల్వల స్థాయిని తగ్గించుకోవడం, బహుముఖ నైపుణ్యాలతో మానవ వనరుల వినియోగం ద్వారా ఉద్యోగుల ఉత్పాదకతను మెరుగుపరుస్తామని తెలిపారు. స్థిరమైన లాభదాయకమైన వ్యాపారం కోసం మార్కెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టి పెడతామన్నారు. దేశ వ్యాప్తంగా మార్కెటింగ్, లైసన్, గనుల శాఖలకు చెందిన అనేక మంది అధికారులు, సిబ్బంది కూడా ఆయా కార్యాలయాల నుంచి పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

వర్షాకాలంలో పిల్లల పట్ల జాగ్రత్త అవసరం

పిల్లలను పరీక్షిస్తున్న చిన్నపిల్లల వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : వర్షాకాలంలో చిన్న పిల్లల పట్ల జాగ్రత్త అవసరమని కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌కు చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నిఖిల్ తెన్నేటి చెప్పారు. కిమ్స్ కడల్స్, గాజువాకలోని బచ్‌పన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ మాట్లాడుతూ వర్షకాలంలో అనేక వ్యాధులు చిన్నారులను ఇబ్బందులకు గురి చేస్తాయని తెలిపారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా జ్వరాలు వస్తుంటాయని చెప్పారు. పాఠశాల నుంచి వచ్చిన వెంటనే చిన్నారులకు వేడి నీటితో స్నానం చేయించాలని సూచించారు. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల, ఇంటి సమీపంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా చిన్నారులకు చేతులు కడుక్కోవడంపై తప్పకుండా అవగాహన కల్పించాలన్నారు. జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని వైద్యులకు చూపించిన తర్వతే మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ పాఠశాల డైరెక్టర్ బిఎం.శ్రీధర్, కిమ్స్ కడల్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టర్ మధు, డాక్టర్ ప్రియాంక, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గోవింద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు వైసిపి అధ్యక్షులు బొడ్డ గోవింద్ జన్మదిన వేడుకలను వడ్లపూడిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి ద్వారా పేదలకు చీరలు పంపిణీచేశారు. బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిత్రాడ కనకసూర్య పద్మావతి, జెసిఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వైసిపి బిసి సెల్ జనరల్ సెక్రటరీ ఎన్నేటి రమణ, స్థానిక నాయకులు ప్రగడ గోవిందరాజులు, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, వి.ఈశ్వరరావు తదితరు జన్మదిన వేడుకల్లో పాల్గొని గోవింద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చీరలు పంపిణీ చేస్తున్న గోవింద్, దేవన్‌రెడ్డి

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఆడారి

ముఖ్యమంత్రికి స్వాగతం

ప్రజాశక్తి-యంత్రాంగం

ములగాడ, సీతమ్మధార : విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పశ్చిమ, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తలు ఆడారి ఆనంద్‌కుమార్, కెకె.రాజు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం నుంచి ఆర్ అండ్ బి కూడలి వరకు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతూ భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌టిఎల్ కూడలిలో ముఖ్యమంత్రికి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన వివిధ వార్డుల కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

వేములవలసలో జనంతో జనసేన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం కూడలి వేములవసలో జనంతో జనసేన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వేములవలస ఎస్‌సి కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రెండో రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త సందీప్ పంచకర్ల మాట్లాడుతూ, జనసేన ప్రభుత్వం వస్తే అర్హులైన యువకులకు రూ.10 లక్షల రుణ సాయం, ఏటా ఐదు లక్షల ఉద్యోగాలు, ఉచితంగా ఇసుక, ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ విధానం రద్దు, లాభసాటి వ్యవసాయం, విశాఖ, తిరుపతి ఐటి హబ్బులుగా అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, ఇఎన్ఎస్.చంద్రరావు, ఎన్ఎన్.నాయుడు, శాఖరి శ్రీనుబాబు, మజ్జి శ్రీను, తమ్మిన అప్పలరాజు, తాడివాడ శివకృష్ణ, తాడివాడ ప్రశాంత్‌కుమార్, ఉప్పాడ యశోద, బాలు, నాని, మీసాల నాగేశ్వరరావు, మూర్తి, గోవిందు, అభి, కృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జోన్ పరిధిలోని సత్యనారాయణపురంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, నాయకులు నూక అప్పారావుతో కలిసి మంగళవారం సాయంత్రం లోకనాథం టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ టిడ్కో గృహాలకు మౌలికసదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో డిడిలు వెనక్కు తీసుకుంటున్నారని తెలిపారు. 3,096 ఫ్లాట్లను నిర్మించినా, లబ్ధిదారులకు వాటిని అప్పగించకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా తాత్సారం చేయకుండా లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గహాలకు ఆనుకొని 2016లో రూ.20 కోట్లతో హుదూద్ తుపాను బాధితులకు నిర్మించిన 510 ఫ్లాట్లను పూర్తిచేసి వారికి అప్పగించకపోవడంతో నిరూపయోగంగా వున్నాయని తెలిపారు. తక్షణమే హుదూద్ ఇళ్లను బాధిత కుటుంబాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



రమణమూర్తి దంపతులను సన్మానిస్తున్న సుగర్ ఫ్యాక్టరీ అధికారులు

రమణమూర్తి దంపతులకు సన్మానం

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ ఫ్యాక్టరీలో ఏవోగా పని చేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొలువు రావడంతో ఉద్యోగాన్ని విడిచి వెళ్లిన స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సోదరుడు పప్పల రమణమూర్తి దంపతులను సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రమణమూర్తి గత కొన్ని ఏళ్ళగా ఫ్యాక్టరీలో కార్మిక శాఖ అధికారిగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఏవోగా నియామకమయ్యారు. 1996 డీఎస్సీ ఉపాధ్యాయులను ఇటీవల కోర్టు ఉత్తర్వులతో నియామకం కావడంతో అప్పట్లో ఎంపికైన రమణమూర్తికి 58 ఏళ్ల వయసులో ఉపాధ్యాయ కొలువు వచ్చింది. దీంతో ఆయన ఫ్యాక్టరీలో ఏవోకు రిజైన్ చేసి ఉపాధ్యాయునిగా వెళ్లారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ ఉద్యోగులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ కార్యదర్శి భాస్కరరావు, నాగేశ్వరరావు, తలారి సత్యనారాయణ, వర్మ, పప్పల మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఏకరూప పౌరస్మృతి'పై సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకరూప సివిల్ కోడ్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్టు కన్వీనర్ బొప్పె ఉమామహేశ్వరరావు, జె రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. ఉద్యోగులు, మేధావులు, యువత, ప్రజలు హాజరు కావాలని కోరారు.

హెచ్చరిక బోర్డు వేసిన రెవెన్యూ సిబ్బంది

అసకపల్లిలో భూ ఆక్రమణ తొలగింపు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అసకపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 1లో భూ ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ వీరయ్య తెలిపారు. అసకపల్లి సర్వే నెంబర్ 1లో కొండ వాగు పోరంబోకు భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమణకు పాల్పడగా, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో విజయశ్రీ, విఆర్ఏ బాతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని కొండపై ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ గుహాలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని బౌద్ధ స్తూపం వద్ద బుద్ధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బౌద్ధ అభిమాన సంఘాల ముఖ్య సభ్యులు, బౌద్ధాభిమానులు, సందర్శకులు పాల్గొని బౌద్ధ స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పూలు, పండ్లు సమర్పించి వందనం నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసా, మారణకాండ చల్లారి అచ్చట శాంతి చేకూరి ప్రజలు ఆనందముగ జీవించేలా బుద్ధుని శాంతి దీవెనలు లభించాలని కోరారు. కార్యక్రమంలో పలు బౌద్ధ సంఘాల ప్రతినిధులు బల్లా నాగభూషణం, నేలపూడి బాలరాజు, బోర వేణు గోపాల్ గౌతమ్, గిలకల అప్పారావు, కాపారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ద్వారా విస్తృత సేవలు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో 522 సచివాలయాల పరిధిలో 5,28,814 కుటుంబాలకు సంబంధించి 3,59,951 ధ్రువపత్రాలను జూలై నెలలో అందజేసినట్టు జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజుకు సగటున పదివేల పత్రాలను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ద్వారా మూడు అంశాలను గుర్తించినట్టు తెలిపారు. మారుమూల గ్రామాల లబ్ధిదారులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరడం, వితంతు పింఛను పథకంలో సామాజిక, సాంకేతిక కారణాలవల్ల ఆలస్యం అవుతున్నట్లు గుర్తించడం, ఏ పథకానికైనా ధ్రువపత్రం ప్రామాణికమని దానిపై ముందుగా దృష్టి పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. 24 మండలాల్లో తహశీల్దార్లు, ఎంపీడివోలు, ప్రత్యేక అధికారులు నిబద్ధతతో పని చేశారన్నారు. సమస్యలు మిగిలి ఉన్నట్లయితే 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 3,61,880 అభ్యర్ధనల్లో 3,59,951 సేవాపరమైన వాటిలో 3,50,066 పరిష్కరించడం జరిగిందని, 3,330 తిరస్కరించగా 6,555 అపరిష్కృతంగా (పెండింగ్)లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, జిఎస్ డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కాంగ్రెస్ నిరసన

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వ అండతో జరిగిన అకృత్యాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన స్థానిన నెహ్రూ చౌక్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రుత్తల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మణిపూర్‌లో బిజెపి ఆర్ఎస్ఎస్ ఉద్దేశ పూర్వకంగానే ఈ దాడులు చేయించినట్లు ఆరోపించారు. మహిళలను నగ్నంగా ఊరేగించి పైశాచిక ఆనందాన్ని పొందటం దారుణమని, ఈ సంఘటనలను ప్రపంచం యావత్తు నిరసిస్తుంటే, బిజెపి మాత్రం ఈ సంఘటనలను సమర్థించే నీచ స్థాయికి దిగజారిందని విమర్శించారు. పిసిసి ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు మాట్లాడుతూ మణిపూర్ మారణకాండపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూండ్రపు అప్పారావు, బుద్ద కిషోర్, ఆడారి రమేష్ నాయుడు, ఐఆర్.గంగాధర్, దాసరి సంతోష్, మళ్ళ శివకుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పిఎసిఎస్‌గా మునగపాక సహకార సంస్థ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : జిల్లా ఉత్తమ పిఎసిఎస్‌గా మునగపాక సహకార సంఘం ఎంపికైనట్లు సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి కోనపల్లి రామ్మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలమంచిలి నియోజకవర్గంలో మునగపాక, పులపర్తి, తిమ్మరాజుపేట సంస్థలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు రావడం ఆనందంగా ఉందన్నారు. ఆప్కాబ్ సంస్థ 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల నాలుగవ తేదీ విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డు తీసుకునేందుకు ఆహ్వానం వచ్చిందని తెలిపారు.

6న రైల్వే స్టేషన్ అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు ఈనెల 6న భూమి పూజ చేయనున్నట్టు ఎంపీ సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్, డిఆర్ఎం హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. డివిజనల్ అధికారులు, పెద్ద ఎత్తున ప్రజలు, రైల్వే పాసింజర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నిబద్ధతతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తే అభివద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి సురేష్ బాబు అన్నారు. బ్యాంక్ తుమ్మపాల బ్రాంచ్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు రిటైర్ అయిన సందర్భంగా గాంధీనగరం ఆర్కే ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41 సంవత్సరాల సర్వీస్‌లో విజయవంతంగా బ్యాంకు అభివద్ధికి కృషి చేసిన శ్రీనివాసరావును అభినందించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుతో పనిచేసిన సిబ్బంది తమ అనుభవాలను పంచుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన సర్వీస్ మొత్తంలో సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూలదండలు, బొకేలు, దుస్సాలువాలు, జ్ఞాపికలతో శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ అడ్మిన్ టి.ఆనందరావు, యూనియన్ లీడర్స్ సాయి సుధాకర్, పక్కి సాయి, అనకాపల్లి బ్రాంచ్ మేనేజర్ సి. మదన్ రాజేష్, బ్యాంకు క్యాషియర్ కే శంకర్రావు, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు

నీటి కుంటను తలపించేలా ఉన్న గోయ్యిలో దిగిన బస్సు

బాబోయ్ గోతులు..

వర్షానికి నీరు చేరి ప్రయాణం నరకయాతన

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలోని పలు రోడ్లు గోతుల నుండి నూతులుగా మారాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పెద్దమదన జంక్షన్ నుండి పిల్లవానిపాలెం వరకు రోడ్డు గోతుల మయంగా మారింది. ప్రతి వంద మీటర్లకు పది గొయ్యిలుగా రోడ్డంతా గొతులతోనే ఉంది. పెద్ద మదీన జగనన్న కాలనీ, కృష్ణానగర్ వద్ద పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వాహనదారులు వేరొక డైవర్షన్ రోడ్లో వెళ్లి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు గుండా నడిచే పలు వాహనాలు గోతుల్లోలో కూరుకుపోతున్నాయి. చింతపాక రోడ్డు సైతం పెద్దపెద్ద గోతులు వున్నాయి. ఈ రోడ్డు కూడా ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రోడ్ల మాట దేవుడెరుగు గోతులైన కప్పండి మహాప్రభువు అంటూ వాహనదారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పెద్ద పెద్ద గోతులతో ఉన్న రోడ్డు

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్‌కు ఆయన కార్యాలయంలో ఏపి గొర్రెలు మేకలు పెంపకం దారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి.అంజనేయులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.తిరుపతిరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి పెంపకందారునికి 54 శాతం సబ్సిడీతో లక్ష రూపాయలు రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు యన్‌సిడిసి వారు 88 కోట్ల రూపాయలు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖాతాకు విడుదల చేసి 6 నెలలు కావస్తుందని, వాటిని వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని కోరారు. గొర్రెలు, మేకలు రాత్రి బసలకు 90శాతం సబ్సిడీతో ఉపాది హామీ నిధులతో షెడ్లు నిర్మించాలని, 50 సంవత్సరాలు నిండిన పెంపకం దారులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలకు ఉచిత ఇన్సూరెన్స్ ద్వారా పశు నష్టం పరిహారం ఇవ్వాలని, పశువైద్యులు, అర్బికేలలో ఉన్న సిబ్బంది ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని రకాల టీకాలు సరఫరా చేయాలని, సంవత్సరానికి 4 సార్లు నట్టల నివారణ మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, చిన్నారులు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-వడ్డాది : తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి తెలిపారు. బుచ్చయ్యపేట మండలం లోపూడి-2, బంగారు మెట్ట, ఎల్‌బిపి అగ్రహారం, కోమళ్ల పూడి అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ పిఒ ఉషారాణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుండి మూడు సంవత్సరాల పాటు తల్లిపాలు క్రమం తప్పకుండా అందించాలన్నారు. తల్లిపాలతోనే పిల్లలకు అధిక పోషకాలు లభిస్తాయని చెప్పారు. అయోడిన్ సాల్ట్ ద్వారా కూడా అధిక పోషకాలు లభిస్తాయని తెలిపారు. క్రమం తప్పకుండా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుని బిడ్డలకు మురుపాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కడియం జ్యోతి, కె సత్య వరహాలమ్మ, ధనలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి హేమ శ్రీ, మహిళా పోలీస్ కామాక్షి, వైద్య సిబ్బంది ప్రభావతి పాల్గొన్నారు.

శంకుస్థాపనలపై ఉన్న ఆరాటం అభివృద్ధిపై లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి శంకుస్థాపనల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నాలుగేళ్ల వైసిపి పాలనలో విశాఖలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అభివృద్ధి ఉందని తెలిపారు. జగన్ రెడ్డి విశాఖపట్నం వచ్చి వెళ్లడం తప్ప జిల్లాకు ఒరిగేదేమీ లేదన్నారు. అతి విలువైన భవనాలు, భూములను కుదువ పెట్టడం ద్వారా బ్యాంకుల నుండి అప్పులు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ సంపద సృష్టించడం చేతకాదని, దానికి మంత్రులు వత్తాసు పలకడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విశాఖ పంచ గ్రామాల సమస్యపై ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కారన్నారు. సింహాచలం భూములు, మాన్సాస్ ట్రస్ట్ భూములను దొంగలించడానికి కుటిల కుతంత్రాలు చేసినప్పటికీ కోర్టులో అడ్డుకోవడంతో వీరి ప్రయత్నాలు ఆగిపోయాయని గుర్తు చేశారు. గంగవరం పోర్టు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 32 వేల కోట్లు విలువైన వాటాను 646 కోట్లకు ఎందుకు అమ్మాల్సి వచ్చిందో ముఖ్యమంత్రి ఈనాటికి ప్రకటన చేయలేదని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో కొప్పి రామకృష్ణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, దాడి పెంటారావు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్డి ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కొత్తూరు జంక్షన్‌లో ప్రజల సౌకర్యార్థం ప్రజా మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి సూదికొండ మాణిక్యాలరావు, నాయకులు నేత వెంకటరమణ మంగళవారం కొత్తూరు గ్రామ పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాల ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రజల ప్రయోజనార్థం వీటిని ఏర్పాటు చేయాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడిలో వైయస్సార్ క్రాంతి పథం (వెలుగు) ఆధ్వర్యంలో మంగళవారం రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఎస్‌హెచ్‌జి సభ్యులకు, స్కూల్ పిల్లలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, హెల్మెట్ లేనిదే వాహనం నడపరాదని, అతివేగం ప్రమాదకరం అనే నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ పెదనాయుడు, ఏపీఎం ప్రభాకర్, ఇన్‌ఛార్జి ఎంఈఓ పడాల్ దాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ తదితరులు

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కీము వర్కర్లు, చిరుద్యోగులపై అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపైనా, సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పలు రంగాల కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో దేశానికి వెన్నుముకగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను పెద్దపెద్ద కార్పొరేట్ శక్తులకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. అనంతరం మండల స్థాయి సిఐటియు సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా ఎస్.బ్రహ్మాజీ, కో కన్వీనర్లుగా అంజలి, కుమారి, మరో 10 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆడారి రామలక్ష్మి, ఆశా యూనియన్ నాయకులు ఈశ్వరవు పార్వతి, వీఓఏ యూనియన్ నాయకులు లంబ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న సర్పంచ్ అరుణ

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని నరసింగబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 ,10 తరగతి విద్యార్థినులకు సైకిళ్లను మంగళవారం పంపిణీ చేశారు. జెట్టపురెడ్డితుని సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నమ్మి మీనా, వైసిపి నాయకులు కెవివి సత్యనారాయణ, కలిగెట్ల నాయుడు, మళ్ల గోపి, కొప్పాక రామగణేష్, మజ్జి ప్రసాదరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో బీసీలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి పాలనలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ ఆరోపించారు. బీసీలను అవమానపరిచిన మోపుదేవి వెంకటరమణ, జోగి రమేష్‌లు వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని కోరుతూ టిడిపి రాష్ట్ర బీసీ సాధికార కమిటీ కన్వీనర్ మల్ల సురేంద్ర ఆధ్వర్యాన రైల్వే స్టేషన్ సమీపంలో భీమని గుమ్మం అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో పాల్గొన్న పీలా గోవింద మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ జగన్ రెడ్డికి బుద్ధి చెప్పి గద్దె దించాలని పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు సబ్బవరపు గణేష్, కాయల మురళి, ఆడారి వెంకట్రావు, యల్లపు శ్రావణ్ కుమార్, గిరిజాల లక్ష్మణరావు, పోలరపు త్రినాథ్, మళ్ళ లోవ కృష్ణ, తలారి కాశీ నాయుడు, తమ్మిన విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు చేరిన ఇవిఎంలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన ఎన్నికల సామాగ్రిని వివిధ రాజకీయ పార్టీ నేతల సమక్షంలో కలెక్టర్ రవి పఠాన్ శెట్టి మంగళవారం గొడౌన్‌లో భద్రపరిచారు. 7 లారీల్లో 9350 ట్రంకు బాక్సుల్లో ఈవీఎం, కంప్యూటర్లు కలెక్టరేట్‌కు సోమవారం రాత్రి 10 గంటలకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైసిపి, తెలుగుదేశం, కాంగ్రెస్, బిఎస్పీ, జనసేన, బిజెపి పక్షాల నాయకులు, ఆర్డీవో చిన్నికృష్ణ, జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ యంత్రాంగం పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- యలమంచిలి రూరల్ : ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో సిసి రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరయ్య, టీపీఓ శ్రీలక్ష్మి, బొద్దపు ఎర్రయ్యదొర, కౌన్సిలర్లు దాసరి చిన్నమ్ములు కుమార్, దుంగ అచ్యుతరావు, కోడిగుడ్ల రమణబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు

7, 8 తేదీల్లో విఆర్ఎల సమస్యలపై 36 గంటల ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి

గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7, 8 తేదీలలో జరగనున్న 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కె. రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు పాదయాత్రలో విఆర్ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, పే స్కేల్ అమలు చేస్తామని, కనీస వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ హామీలు నేటికీ అమలు చేయలేదని తెలిపారు. ఇప్పటికే ప్రమోషన్లు రాక అర్హత ఉన్నవాళ్లు ఇబ్బందులు పడుతున్నారని, డిఏ ఇవ్వడంలేదని, నామినీ వీఆర్ఏలను వీఆర్ఏలుగా ఇప్పటి వరకూ గుర్తించలేదని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ శాంతకుమారి, కోశాధికారి ఎం సంతోష్ కుమార్, డివిజన్ అధ్యక్షులు, టి.సింహాచలం, వి.అప్పారావు టి.సన్యాసిరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఇందల కొండలరావు

ఘనంగా ఇందల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ : టిడిపి పరవాడ మండల ప్రధాన కార్యదర్శి ఇందల కొండలరావు జన్మదిన వేడుకలు పరవాడలో నీకోన హోటల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్టా సన్యాసి అప్పారావు ఇందల కొండలరావు చే కేక్ కట్ చేంచి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కమిటీ సభ్యులు జలపాల రాము, టిఎన్టియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్లి శ్రీనివాస్, తెలుగు యువత మండల అధ్యక్షులు గండి మహేష్ పాల్గొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామపంచాయతీ పార్కులో మంగళవారం గ్రామ సర్పంచ్ తట్ల పెంటయ్య నాయుడు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని, సంపూర్ణమైన ఆక్సిజన్ మొక్కలతోనే సాధ్యమని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఇంటికి ఒక మొక్క నాటితే తుమ్మపాల కాలుష్య రహిత గ్రామంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్లు రవ్వ శ్రీను, తరా సత్యా రావు, కొణతాల అర్జున్ నాయుడు, వెలగా మోది నాయుడు, హైస్కూల్ చైర్మన్ గొంతిన శ్రీను, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పెన్షన్

ప్రజాశక్తి -వడ్డాది : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వడ్డాది గ్రామం, రెల్లి వీధికి చెందిన ముత్యాల రేవతికి వైయస్సార్ పెన్షన్ కానుక అందించారు. రేవతి ఐదేళ్లగా బాలిక సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో ఆమెకు పెన్షన్ కానుక మంజూరైంది. ఇందులో భాగంగా మంగళవారం రూ.10వేలు పింఛను అందజేశారు. ప్రతి నెలా ఈ రూ.10వేలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి, ఎంపీటీసీ ఇంటి అప్పారావు, స్కూల్ కమిటీ చైర్మన్ ముత్యాల లోవరాజు, గృహ సారథులు కిషోర్, నాగేష్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

కొత్తకోట పిహెచ్‌సి రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -కొత్తకోట : జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి మంగళవారం రావికమతం మండలంలో ఆకస్మిక సుడి గాలి పర్యటన చేశారు. కొత్తకోట పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలతో మాట్లాడి ఎన్‌సిడి సర్వేపై ఆరా తీశారు. ఆధార్ లేక ఆభా ద్వారా రోగుల వివరాలను సేకరించి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అందుకు కావలసిన శిక్షణ సిబ్బందికి అందించాలని డిఎంఅండ్‌హెచ్‌వో హేమంత్ కుమార్‌ను ఆదేశించారు. పిహెచ్‌సిలో రోజువారీ ఓపీ, ఆరోగ్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా ముందుగా చర్యలు చేపట్టాలని వైద్యాధికారి రజినిని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిహెచ్‌సి భవనానికి స్థలమిచ్చి, ఉపాధి కోల్పోయామని కొత్తకోటకు చెందిన అయితి నానాజీ దంపతులు కలెక్టర్ ను కోరగా, దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని డిఎంహెచ్‌ఒకు సూచించారు. అనంతరం జడ్ కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యాప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు సచివాలయ భవన నిర్మాణంపై ఆరా తీసి, పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 30 గ్రామాల ప్రజల రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్తకోట, గాలివారి కొంపలు మధ్య పూర్తిగా శిథిలమైన రహదారి బాగుచేయాలనిమండల కో ఆప్షన్ మెంబర్ గాలి రమణబాబు జిల్లా కలెక్టర్ ను కోరారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చీమలపాడులో ఆర్‌బికె నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ స్వరణ రాజ్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, పిడి అనంతలక్ష్మి, నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం, ఎడిఎంఅండ్‌హెచ్‌ఒ వీరజ్యోతి, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపిడిఒ వెంకన్నబాబు, పిఒ శారాణి, పిఆర్ డిఈ ప్రసాద్, జెఇ సుమతి పాల్గొన్నారు.

జీలుగులోవ ఆదివాసీలకు కలెక్టర్ అభినందన

చీమలపాడు శివారు జోగంపేట గ్రామానికి సమీపంలో కొండపై ఉన్న జీలుగులోవ ఆదివాసీ గ్రామానికి ఉపాధి హామీ పథకం ద్వారా రహదారి ఏర్పాటు చేసుకోవడంపై జిల్లా కలెక్టర్ ఆదివాసీలను అభినందించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం, తాగునీరు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టడంతో స్పందించిన జిల్లా అధికారులు ఉపాధి హామీ పథకం నిధులతో రహదారి సౌకర్యం కల్పించారు సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలో జె.నాయుడుపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ అందిందా, లేదాయని ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నలుగురు పిల్లల మాత్రమే ఉండడంపై అంగన్వాడీ టీచర్‌ను ప్రశ్నించారు. ఆర్‌బికె కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో దేవాలయం, పాఠశాలకు దగ్గరలో ఉన్న మద్యం దుకాణం మార్చాలని ఎంపిటిసి బి.నరేష్ వినతిపత్రం అందజేశారు. ఆర్‌డిఒ జయరాం, డిఎంహెచ్‌ఒ హేమంత్, డిఇ ప్రసాద్, తహశీల్దార్ కె.వరహాలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సిపిఎం నేత గోవింద్

హుటాహుటిన గోతులను కప్పుతున్న కాంట్రాక్టర్లు

కలెక్టర్ కోసం రోడ్డు చదును

ప్రజాశక్తి-రోలుగుంట : మండల కేంద్రమైన రోలుగుంట తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలకు వెళ్లే కూడలిలో ఆర్అండ్‌బి రోడ్డు చినుకుపడితే చెరువును తలపిస్తోంది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపధ్యంలో మంగళవారం మండలానికి జిల్లా కలెక్టర్ పర్యటన నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్ గోతులమయమైన రోడ్డును జెసిబితో లెవెల్ చేయించారు. కలెక్టర్, ఎమ్మెల్యే, ఇలా వివిపిలు వస్తే తప్ప రోడ్లు బాగుచేయరా? అధ్వానరోడ్లకు శాశ్వతపరిష్కారం చూపరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ఉచిత విద్యుత్ సేవలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఐదు ప్రభుత్వ కార్యాలయాలకు సూకాంబిక ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత విద్యుత్ సేవలు అందిస్తామని యూనియన్ నాయకులు వెల్లడించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అంబేద్కర్, మండల పరిషత్‌లో ఎంపిడిఒ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ ,పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శిరీష , నక్కపల్లి సిహెచ్‌సి వైద్యాధికారికి, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలోనూ ఉచిత ఎలక్ట్రికల్ సేవలు అందిస్తామని ఎలక్ట్రీషియన్ల ఫోన్ నెంబర్ల తో కూడిన సమాచార పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ప్రభాకరరావు, కె. సాయి, వెంకటేష్, శ్యామ్ కిషోర్, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

నేడు కోణాం జలాశయ నీరు విడుదల

ప్రజాశక్తి-చీడికాడ : ఆయకట్టు రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సాగుపనులు, వరి నాట్లు వేసేందుకు వీలుగా కోణాం పాలవెల్లి జలాశయం నుండి ఎగువ, దిగువ కాలువల ద్వారా నీటిని బుధవారం విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ జెఇ జైరాం తెలిపారు. ఎంపిపి కె. జయమ్మ నారాయణమూర్తి, జెడ్‌పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్ నీటిని విడుదల చేస్తారన్నారు.కార్యక్రమంలో అధికారులు, నాయకులు రైతులు పాల్గొనాలని కోరారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలోని 12వ వార్డు పెద్ద బొడ్డేపల్లిలో మూడు సిసి రోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ నాలుగు సిసి రోడ్లకు ఒక్కొక్కటి రూ.5 లక్షల అంచనాతో మంజూరుచేయగా, మూడురోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

డిపిఒ కార్యాలయానికి కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి : కలెక్టర్ అభ్యర్థన మేరకు హెటిరో డ్రగ్స్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో జిల్లా పంచాయతీ కార్యాలయానికి నాలుగు కంప్యూటర్లు బహూకరించారు. నక్కపల్లి మేజర్ పంచాయితీ కార్యాలయంలో మంగళవారం కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కొల్లాయి రెడ్డి, రాజారెడ్డి కంప్యూటర్లను ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, ఎఒ సీతారామ రాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు అందజేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, డిసిసిబి మాజీ ఉపాధ్యక్షులు మణిరాజు,సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపిటిసి గంటా తిరుపతిరావు, వైసిపి నేతలు పాపారావు, తళ్ల భార్గవ్, అల్లాడ కొండ, రోకళ్ల శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు .

కంప్యూటర్లు అందజేస్తున్న హెటిరో ప్రతినిధులు

బాల్యవివాహాల రహితంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రతి గ్రామాన్ని బాల్యవివాహాల రహితంగా తీర్చిదిద్దాలని శ్రీ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ కెఎస్‌సిఎఫ్, సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ డెవలప్ మెంట్ సీడ్ సొసైటీ కోఆర్డినేటర్ గణపతి అమ్మ, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపిపి సుర్ల రాజేశ్వరి ఆవిష్కరించారు..

గణపతి అమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎదుగుతూ వికసించే బాలికలను కాపాడవలసిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. 18ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేసేందుకు సహకరించిన పెద్దలు, పురోహితులు, పాల్గొన్న వ్యక్తులు తల్లిదండ్రులు నేరస్తులుగా పరిగణించబడతారన్నారు బాల్యవివాహాలు జరగకుండా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 18001027222 మరియు 1098 కు సంప్రదించాలన్నారు. ఇన్నం రత్నం, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ రమణ ధర్మసాగరం సర్పంచ్ గొంప అప్పలనాయుడు పాల్గొన్నారు

రోడ్ల విస్తరణపై ఎమ్మెల్యే వైఖరి ఏంటి?

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే గణేష్ తన స్పష్టమైన వైఖరిని ప్రజలకు తెలియజేయాలని జనసేన నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 100 అడుగుల రోడ్డు విస్తరణ చేస్తామన్న కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. ఈ మేరకు కొన్ని నిర్మాణాలను కూడా తొలగించారన్నారు. ఇపుడు మళ్లీ 90 అడుగులు విస్తరణ చేస్తామని ప్రకటిస్తున్నారన్నారు. గతంలో 120 అడుగులకు రోడ్డు విస్తరణ చేయాలని నర్సీపట్నం అభివృద్ధి కమిటీ పేరుతో ర్యాలీలు, నిరసనలు చేసిన వారు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలోగూడెపు తాతబాబు, చిరంజీవి శ్రీను, పెనుబోతల నాగు, కొత్తకోట రామశేఖర్, బోయిన చిరంజీవి, కర్రి సంతోష్ వేగిశెట్టి శ్రీనివాస్, బైన మురళీ, రామకృష్ణ, వాసం వెంకటేష్,పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల : జనసేన నేత రాయపురెడ్డి కృష్ణ సాగరం పంచాయతీ యువకులకు మంగళవారం క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. పాత కాలనీకి చెందిన యువకులకు స్థానిక జనసేన నేత పాము నాగరాజు కిట్ అందజేశారు. కార్యక్రమంలో గట్ట రామారావు, పలువురు యువకులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

మండల సభలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మండల పరిషత్ సర్వసభ్యసమావేశం సాదాసీదాగా, మొక్కుబడిగా సాగింది. ఎంపిపి సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేములపూడి ఎంపిటిసి బోళెం రాంప్రసాద్ గ్రామాల్లో పెరిగిపోతున్న బెల్ట్‌షాపులు నియంత్రణకు ప్రభుత్వ అధికారులు చూడాలన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందే విధంగా చూడాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న బియ్యం మాత్రమే రేషన్ షాపుల్లో ఇస్తున్నారని, నాలుగైదు నెలలుగారాష్ట్ర ప్రభుత్వం రేషన్ ఇస్తుందో లేదో స్పష్టం చేయాలన్నారు. గ్రామంలో కొన్ని కుటుంబాలకు గ్యాస్ కలెక్షన్లు లేకున్నా ఆన్‌లైన్‌లో ఉన్నట్లు చూపిస్తున్నాయని, వాటిని పరిశీలించి లేనివారికి కొత్త కనెక్షన్లు ఇవ్వాలని ధర్మసాగరం సర్పంచ్ గొంప అప్పలనాయుడు కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేకు ప్రజలంతా సహకరించాలని తహశీల్దార్ కోరారు. వేములపూడి పాఠశాలను రూ. 5 కోట్ల కేంద్ర ప్రభుత్వనిధులతో అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభమౌతాయని ఎంఇఒ తెలిపారు. సర్పంచ్‌లు,ఎంపిటిసిల హాజరు తక్కువగా ఉండడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. జెడ్‌పిటిసి సుకల రమణమ్మ, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, మండల పరిషత్ సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు.

పాడి పశువులకు లంపీ స్కిన్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-రోలుగుంట : పాడి పశువులకు ప్రాణాంతకమైన ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్) రాకుండా ఉచితంగా నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని జె.నాయుడుపాలెంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాద్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్ర జ్వరం, శరీరంపై వివిధ భాగాల్లో బొబ్బలు, ముక్కు నోటి నుండి స్రావాలు మొదలగు లక్షణాలతో పశువులు కనిపించినట్లయితే వెంటనే సమీపంలో పశువైద్యశాలకు సమాచారం అందించాలని తెలిపారు. కుసర్లపూడి పశువైద్యాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, రోలుగుంట పశువైద్యాధికారి డాక్టర్ సూరేశ్వరావు మాట్లాడుతూ ఇటువంటి వ్యాధి సోకిన పశువులు నుండి వేరే పశువులకు జోరీగల ద్వారా వ్యాపిస్తుందన్నారు. కావున రైతులు తగిన జాగ్రత్తలు, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. గోపాల మిత్రులు సన్యాసినాయుడు, చిన్నంనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గొలుగొండ : నర్సీపట్నం మెయిన్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ కార్యక్రమాలకు మద్దతుగా గొలుగొండ మండలం జోగంపేటలో వైస్ ఎంపిపి జక్కు నాగమణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన రాజకీయ స్వలాభం కన్నా ప్రజా శ్రేయస్సే మిన్న అని భావించి నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణతో పాటు ఎన్నో ఏళ్ల పాటు అభివృద్ధికి నోచుకోని ఆరిలోవ అడవి రోడ్డు మార్గం విస్తరణ చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి సాహసోపేతం నిర్ణయం తీసుకున్నఎమ్మెల్యే గణేష్ ఎంతో ఆశయం కలవారని కొనియాడారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్నామని భావించి కోర్టుకు వెళ్లిన బాధితులతో స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి నర్సీపట్నం పట్టణాభివృద్ధికి సహకరించాలని, భవిష్యత్తు తరాల మంచి కోసం సహాయపడాలని ఎమ్మెల్యే విన్నవించిన విధానం చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మండల అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామి నాయుడు, జోగంపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు పంచాద నాగరాజు, సాలికమల్లవరం పార్టీ అధ్యక్షుడు పెడిరెడ్ల అప్పల నాయుడు, వేముల సత్యనారాయణ, గొలగనప్పారావు, కడిం గంగన్న, కళ్ళంపూడి శ్రీను, గొర్లి కన్నయ్య అధిక సంఖ్యలో మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైస్ ఎంపిపి

దేముడుకు ఘన నివాళి

దేముడు భౌతిక కాయానికి సిపిఎం నేతల నివాళులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : సిపిఐ సీనియర్‌నేత మాకిరెడ్డి దేముడు మంగళవారం ఉదయం స్వగ్రామం గబ్బాడలో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు జి. కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ గౌరి, కోశాధికారి కె.సూర్యప్రభ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ భూస్వామి కుటుంబంలో పుట్టి 1963 నుండి కమ్యూనిస్టు పార్టీలో చేరిన మాకిరెడ్డి దేముడు నర్సీపట్నం ప్రాంత సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. సిపిఎం నేత సాపిరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ ఉన్నతమైన కమ్యూనిస్టు విలువలతో కూడిన జీవితాన్ని గడిపి, నేటితరానికి ఆదర్శప్రాయులుగా నిలిచారన్నారు.

చిత్రకారుడు రాజు అకాల మరణం

రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి-మాడుగుల: గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పుట్టా రాజేంద్రప్రసాద్ (రాజు) మృతి చెందారు. రైతు సంఘం నేత పుట్టా కృష్ణ మూర్తి రెండవ కుమారుడు అయిన రాజు కొన్నేళ్లుగా విశాఖలో వుంటున్నారు. చిన్న తనం నుండి అనేక చిత్రాలు గీసి పేరు, ప్రఖ్యాతులు పొందారు. అరుదైన కళాఖండాలు రూపొందించారు. వేణుగానం సాధన చేసేవారు. ప్రస్తుతం సబ్బవరం పిహెచ్‌సిలో అవుట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న రాజు, ఇటీవల మధుమేహ వ్యాధికి గురై అతి తీవ్రం కావడంతో విశాఖలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. రాజు భౌతిక కాయాన్ని బంధువులతో పాటు,చిన్న నాటి స్నేహితులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి నివాళులు అర్పించారు. మృతుని సోదరులు రవి,పెద్ద ప్రసాద్,చిన్న ప్రసాద్, బంధువులు వీర గంగాధర్, చిన్న, హనుమంతు రావు అధ్వర్యంలో మంగళవారం మాడుగులలో అంత్యక్రియలు నిర్వహించారు

స్వామిత్వ సర్వే పరిశీలన

సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిపిఒ శిరీషారాణి

ప్రజాశక్తి -నక్కపల్లి : స్వామిత్వ పథకం గ్రామాల సర్వే పక్కగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి కోరారు. మంగళవారం మండలంలోని బోదుగల్లంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు.దీనికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామ కంఠం, ఇండ్లు, ఖాళీ నివాస ప్రాంతాల వివరాలను సర్వేచేసి, పక్కాగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు .అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రాన్ని, నక్కపల్లి లో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నక్కపల్లి పంచాయతీ కార్యాలయాన్నిసందర్శించారు.రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, ఎఒ సీతారామరాజు, పంచాయతీ

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల నిరసన

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పెద్దబొడ్డేపల్లి సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొటేశ్వరరావు మాట్లాడుతూ ఏళ్లతరబడిమున్సిపాల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని వారికి కనీసవేతనాలు , ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు.కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పని చేసినా ప్రమాద బీమా అమలు కాలేదన్నారు. ఎన్నికల సమయంలో వీరిని రెగ్యులర్ చేస్తామన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ అమలు చేయాలని డిమాండ్ చేసారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను పెంచాలని, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, యూనియన్ నాయకులు బి.శ్రీనివాసరావు, కె. రాజు ,రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

పోరుయాత్ర జాతాలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి

రాజయ్యపేటలో మాట్లాడుతున్న ప్రభావతి

ప్రజాశక్తి- నక్కపల్లి :మహిళలపై హింసను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి డిమాండ్ చేసారు. మహిళలపై హింసను అరికట్టాలని, మద్యం గంజాయి వంటి మత్తు పదార్ధాలు నియంత్రించాలని, మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలన్న తదితర డిమాండ్లతో ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరుయాత్ర రాష్ట్ర జాతా సోమవారం రాత్రి నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటకు చేరుకుంది. పోరు యాత్రలో పాల్గొన్న ఐద్వా నేతలకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. కళాకారులు కళ ప్రదర్శన, పాటలు గ్రామస్తులను విశేషంగా ఆకర్షించి, ఆలోచింపజేసాయి. ఈ సందర్భంగా సమావేశంలో ప్రభావతి ,పలువురు నేతలు మాట్లాడారు.

దేశంలో అత్యాచారాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు .స్త్రీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఐద్వా నేతలు సత్యవతి, రమణి, పూర్ణ, మాణిక్యం, చంద్రకళ, సిపిఎం నేతలు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ, ఎం.మహేష్ బాబు, ఎం.రాంబాబు, జి.సోమేశ్వరరావు, సిహెచ్.సోమేష్ ,పి.శ్రీను, ఎం.జాన్, ఎం.భయ్యన్న, పి.రమణ, కె.భూలోక, కె.కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ తోడ్పాటుతో ఉర్దూ పాఠశాలకు టీచర్

ఉర్దూ పాఠశాలలో మాట్లాడుతున్న ఆవాజ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముస్లిం తాటిచెట్లపాలెంలో ఉన్న జివిఎంసి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉర్దూ సబ్జెక్టు బోధించడానికి ఒక్కరే టీచర్ ఉండడంతో అక్కడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్టు ఆవాజ్ జిల్లా కమిటీ గుర్తించింది. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉర్దూ సబ్జెక్ట్ బోధించడానికి ఒక పార్ట్ టైం ఉర్దూ టీచర్‌ను ఈ మేరకు ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జనాబ్ ఎండి ఆయుబ్ మంగళవారం మీడియాకు తెలిపారు. సోనీ క్యాటరింగ్ సర్వీసెస్ అధినేత జనాబ్ మొహమ్మద్ హబీబ్ సహకారంతో ఈ కొత్త నియామకం చేసినట్టు వెల్లడించారు. ఆవాజ్ జిల్లా కమిటీ కూడా ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. పార్ట్ టైం టీచర్ నియామకానికి అనుమతి ఇచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శాంతి కుమారికి ఆవాజ్ జిల్లా కార్యదర్శి అష్రఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ మునీర్ ముషహద్, ఉర్దూ ఆచార్యులు మొహమ్మద్ వసీం రెహమాన్ పాల్గొన్నారు.

దళితుల భూమి తగ్గించి చూపడం అన్యాయం

దళితుల భూమిలో రైతులతో సిపిఎం నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇటీవల నిర్వహించిన సమగ్ర భూసర్వేలో బాపిరాజు కొత్తపల్లి గ్రామంలో దళితులకు ఇచ్చిన డి ఫారం భూమి విస్తీర్ణం తగ్గించి చూపడం అన్యాయమని సిపిఎం నాయకులు అప్పలరాజు అన్నారు, మంగళవారం గ్రామంలో దళితులకు కేటాయించిన భూమిని రైతులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2004-05లో 100 ఎకరాలు భూమిని90 మంది రైతులకు కేటాయించి డిఫారం పట్టాలు ఇచ్చారని, ఇపుడు నిర్వహించిన సర్వేలో భూముల విస్తీర్ణం తగ్గించి నమోదు చేయడం పట్ల దళితులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సర్వే సమగ్రంగా చేపట్టి దళితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ, కుల వ్యవసాయ పోరాట సంఘం నాయకులు దేవీద్రాజు, పి రవి, కె రాము, వై రమేష్, ఎం సత్యవతి, పి లోవరాజు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ మంగళవారం ఉదయం ఎంవిపి కాలనీ రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రైతులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతుబజార్‌లో వినియోగదారులతో ఎలా మెలగాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంవిపి రైతు బజార్ ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, సహాయకులు జి.కనకరాజు పాల్గొన్నారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని బీచ్‌లో మంగళవారం అవంతి ఫార్మా డి విద్యార్థులు వ్యర్థాలు తొలగించారు. స్థానిక జాలరులకు సముద్ర పరిరక్షణపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబివి.రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

26వ రోజుకు అణుకు గిరిజనుల దీక్షలు

దీక్షల్లో పాల్గొన్న గిరిజనులు, సిపిఎం నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి-కోటవురట్ల: అణుకు గిరిజన గ్రామానికి పాఠశాల రహదారి సౌకర్యం కల్పించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 26 రోజులకు చేరుకుంది.సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, మండల సిపిఎం నాయకులు డేవిడ్ రాజు దీక్ష శిబిరం పాల్గొని నినాదాలు చేశారు. దీక్ష శిబిరంలో పాఠశాల విద్యార్థులు గిరిజనులు పాల్గొన్నారు

సమగ్ర భూసర్వేపై సమీక్ష

తహశీల్దార్ కార్యాలయ సందర్శనలో జెసి జాహ్నవి

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న భూసర్వే కార్యక్రమంపై మంగళవారం జెసి జాహ్నవి తహశీల్దార్ కార్యాలయంలో బికెపల్లి రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బందితో సమీక్షించారు., బికెపల్లి గ్రామంలో సర్వే జరుగుతున్న తీరు సిబ్బంది పట్ల పలువురు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం,. దీంతో సిబ్బందితో సమావేశం నిర్వహించినట్లు తెలియ వచ్చింది, సుమారు గంటపాటు జరిగిన సమావేశ వివరాల సారాంశం తెలియరాలేదు. అయితే సమావేశానికి పత్రికాప్రతినిధులను అనుమతించలేదు. అనంతరం ఆమె కోటవురట్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల సందర్శించి విద్యార్థుల ప్రతిభను గుర్తించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉండడంతో పాటు అసంపూర్తిగా ఉన్న భవనాలపై ఎంఇఒ జాన్‌ను వివరాలు అడిగి తెలుసుకొని అసహనం వ్యక్తం చేశారు. తాహశీల్దార్ జానకమ్మ, డిటి సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కార్యకర్తల భవితవ్యం అని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. మంగళవారం నర్సీపట్నం ఎన్‌జిఒ హోమ్‌లో జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ చేశారు.. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ రేపటి తరాల భవిష్యత్తు కాంక్షించి, సమ సమాజ శ్రేయస్సుకు బాటలు వేస్తూ ఒక నిర్దిష్ట లక్ష్యంతో,సామాన్యులు సైతం రాజకీయం చేసేలా యువత కలల సాకారం కోసం జనసేన పార్టీని పవన్ కళ్యాణ్ స్థాపించారన్నారు. ఇందులో పనిచేసే వారికి భరోసాకు క్రియాశీల సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు రూ. 5 లక్షల బీమా, రూ.500 నామమాత్రపు రుసుముతో ప్రపంచంలో ఎక్కడైనా వైద్యం చేయించుకోవచ్చన్నారు.